
సాక్షి
బాపట్ల
శనివారం । 28 । జూన్ । 2025



ముగిసిన సదరం క్యాంప్

తెనాలి అర్బన్: వికలాంగుల ధ్రువపత్రాల పునపరిశీలనలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంప్ శుక్రవారంతో ముగిసింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 514.30 అడుగుల వద్ద ఉంది. ఇది 139.0872 టీఎంసీలకు సమానం.



అమ్మవారికి బోనాలు

పిడుగురాళ్ల: ఆషాఢ మాసం నేపథ్యంలో పట్టణ భవానీనగర్‌లోని శ్రీ కనకదుర్గ దేవస్థానంలో శుక్రవారం అమ్మవారికి మహిళా భక్తులు బోనాలు సమర్పించారు.

న్యూస్‌రీల్

గంగమ్మ తల్లికి వెండి కవచం బహూకరణ



కారంచేడు: గ్రామ దేవతగా విరాజిల్లుతున్న గంగమ్మ తల్లికి భక్తులు 9 కేజీల వెండి కవచం బహూకరించారు. శుక్రవారం మండల కేంద్రమైన కారంచేడు పుట్టాయిపాలెంలో కొలువైన గంగమ్మకి గ్రామానికి చెందిన ఒక భక్తుని కుటుంబం మొత్తం 9 కేజీల వెండితో తయారు చేసిన కవచాన్ని కమిటీ సభ్యులకు అందించింది. వెండి కవచం, కిరీటాన్ని అమ్మవారికి ఆలయ అర్చకులు ఆవుల రాజేష్ ధరింపజేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

సీ మౌత్ అభివృద్ధికి రూ. 2 కోట్లు



బాపట్ల టౌన్: అడవి పంచాయతీ ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్ కాలువ సిమెంట్ కాంక్రీట్ పనులకు రూ. 2 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి చెప్పారు. శుక్రవారం కాలువను ఆయన పరిశీలించి, మాట్లాడుతూ వివాదానికి కారణమైన భూమిపై కమిటీ ఏర్పాటు చేశామన్నారు. సీ మౌత్ కాలువ వద్ద డ్రెడ్జింగ్ ద్వారా పూడిక వెలికి తీసే పనులు త్వరలో ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. సీ మౌత్ తీర ప్రాంతంలో జెట్టి నిర్మాణం చేపడతామని తెలిపారు. దీంతో మత్స్యకారులు పడవలు నిలపడానికి సులువుగా ఉంటుందన్నారు. ఆరు నెలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి గ్లోరియా, తహసీల్దార్ సలీమా పాల్గొన్నారు.

బాపట్లలో ఆక్రమణల తొలగింపు



బాపట్ల టౌన్: తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న తమ షాపులను ఎందుకు కూల్చుతున్నారంటూ మున్సిపల్ అధికారులను దుకాణ యజమానులు నిలదీశారు. రోడ్డుపైకి షాపులు కట్టి... డ్రైనేజీలను ఆక్రమించిన వారి నిర్మాణాలను వదిలిపెట్టి తమకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. శుక్రవారం పట్టణంలోని త్రవ్వకాలువ నుంచి చీలురోడ్డు వరకు షాపులను జేసీబీలతో మున్సిపల్ అధికారులు తొలగించే కార్యక్రమం చేపట్టారు. ముందు మున్సిపల్ కాంప్లెక్స్‌లోని ఆక్రమణలు తొలగించిన తర్వాతే తమ దగ్గరకు రావాలని దుకాణ యజమానులు ఆందోళనకు దిగారు. దీంతో మున్సిపల్ అధికారులు తాత్కాలికంగా తొలగింపు పనులు నిలుపుదల చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి వెండి నాగపడగ



మోపిదేవి: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి దర్శికి చెందిన యారాశి శ్రీకాంత్ రెడ్డి, చంద్రిక కుటుంబ సభ్యులు వెండి నాగపడగను శుక్రవారం సమర్పించారు. ఉదయం ఆలయానికి చేరుకున్న వారు.. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణకు 550 గ్రాముల బరువున్న సుమారు రూ. 60 వేలతో చేయించిన నాగపడగను స్వామివారి కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

నేడు పానకాల స్వామి గుడిలో సహస్ర దీపాలంకరణ

మంగళగిరి: మంగళాద్రిలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయం(పానకాల స్వామి)లో శనివారం సాయంత్రం సహస్ర దీపాలంకరణ ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఈవో సునీల్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఉత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకోవాలన్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

టెండర్లలో తిరకాసు

- ఏఎన్‌యూలో నిర్మాణ పనుల టెండర్ల ప్రక్రియపై ఆరోపణలు
- అన్ని అర్హతలూ ఉన్న కాంట్రాక్టర్ల దరఖాస్తులు తిరస్కారం
- నచ్చినవారికి కట్టబెట్టేందుకే నాటకం
- కాంట్రాక్టర్ల మండిపాటు
- చిన్నబాబు ఇలాకాలో ఇష్టారాజ్యం
- ఏపీఈడబ్ల్యూఐడీసీ తీరుపై తీవ్ర విమర్శలు



విద్యలకు నిలయమైన ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పలు భవనాల నిర్మాణ పనులు చేపట్టేందుకు ఇటీవల పిలిచిన టెండర్ల వ్యవహారంలో పెద్దఎత్తున గోల్‌మాల్ జరిగింది. సొమ్మొకరిది.. పెత్తనమొకరిది అన్నట్లుగా టెండర్లను పర్యవేక్షిస్తున్న ఏపీఈడబ్ల్యూఐడీసీ అధికారులు వ్యవహరించారు. అస్మదీయులుకు కోట్ల రూపాయల పనులను కట్టబెట్టేందుకు నిబంధనలను కాలరాశారు. నిర్మాణ రంగంలో అపార అనుభవం, అన్ని అర్హతలున్న కాంట్రాక్టర్లను పక్కన బెట్టారు. యూనివర్సిటీ, ప్రభుత్వ నిధులతో చేపడుతున్న పనులపై ఏపీఈడబ్ల్యూఐడీసీ పెత్తనంపై కాంట్రాక్టర్ల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీని వెనుక పెద్దఎత్తున చేతులు తడిపినట్లు ఆరోపిస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రూసా 2.0 కింద ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో రూ. 10కోట్లతో హబ్ సెంటర్, రూ. 4 కోట్లతో ఎకామిడేషన్ బ్లాక్ ఫర్ ఎంప్లాయిబిలిటీ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ భవనం నిర్మాణాలకు టెండర్లు ఆహ్వానిస్తూ ఈ ఏడాది మే 2న విజయవాడకు చెందిన ఏపీఈడబ్ల్యూఐడీసీ (ఆంధ్ర ప్రదేశ్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) వేర్వేరుగా ప్రకటనలు జారీ చేసింది. నిర్మాణ రంగంలో అపార అనుభవం, అన్ని అర్హతలు, ఆసక్తి ఉన్న సంస్థలు ఆన్‌లైన్‌లో టెండర్లు దాఖలు చేశాయి. రూ. 10కోట్లతో భవన నిర్మాణానికి ఏడు, రూ. 4 కోట్లతో నిర్మించే భవనానికి నాలుగు సంస్థలు బిడ్లు దాఖలు చేశాయి. గడువు కూడా మే 30తో ముగిసింది.

ఒకే సంస్థ టెండర్ ఆమోదం

టెండర్లను వెంటనే తెరవాల్సి ఉన్నా 20 రోజుల వరకు ఏపీఈడబ్ల్యూఐడీసీ అధికారులు తాత్సారం చేశారు. తెరిచిన తర్వాత రూ. 10 కోట్ల వ్యయంతో నిర్మించే భవనానికి దాఖలు చేసిన ఆరు సంస్థల బిడ్లను తిరస్కరించారు. ఒక సంస్థకు మాత్రమే అర్హత ఉన్నట్లుగా పేర్కొన్నారు. రూ. 4 కోట్లతో నిర్మించే భవనానికి దాఖలైన నాలుగు బిడ్లలో మూడింటిని తిరస్కరించారు. ఒక బిడ్‌కు అర్హత ఉన్నట్లు తేల్చారు. విచిత్రమేమంటే రెండు భవనాల నిర్మాణానికి ఒకే సంస్థ దాఖలు చేసిన బిడ్‌కు అర్హత ఉన్నట్లుగా పొందు పరిచారు. మిగితా వారందరికీ అర్హత ఉన్నా ఎందుకు తిరస్కరించారనేది అంతుచిక్కని విషయం. ఈ అంశాన్ని బయటకు కూడా వెల్లడించడం లేదు. ఏపీఈడబ్ల్యూఐడీసీ చీఫ్ ఇంజనీర్ కూడా ఫోన్లు ఎత్తడం లేదని, ఒకవేళ ఎత్తినా విషయం అడగగానే కట్ చేస్తున్నట్లు కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. మంత్రి లోకేష్ ప్రాతినిధ్యం వహించే శాఖలో, ఆయన నియోజకవర్గంలో జరుగుతున్న పనుల టెండర్లలో అక్రమాలు జరగడం చర్చనీయాంశంగా మారింది.



విస్తుపోతున్న కాంట్రాక్టర్లు

రూ.10కోట్లతో నిర్మించే భవనాల కోసం జరిగే టెండర్ల ప్రక్రియలో సాధారణంగా అన్ని అర్హతలు, ప్రమాణాలు ఉన్న సంస్థలే బిడ్‌లు దాఖలు చేస్తాయి. ఒక వేళ పేర్కొన్న నిబంధనల ప్రకారం ప్రమాణాలు లేకపోతే ఒకటి, రెండు సంస్థలు తిరస్కారానికి గురవుతాయి. కానీ ఏడు సంస్థలు బిడ్లు దాఖలు చేస్తే ఆరు తిరస్కారానికి గురవ్వడంపై కాంట్రాక్టర్లు విస్తుపోతున్నారు. మరో భవన నిర్మాణానికి నాలుగు సంస్థలు బిడ్‌లు దాఖలు చేస్తే, మూడు తిరస్కారానికి గురవ్వడం నిర్మాణ రంగంలో నైపుణ్యం ఉన్న వారందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

నచ్చిన వారికి కట్టబెట్టేందుకే..

తమకు నచ్చిన వారికి కట్టబెట్టేందుకే ఏపీఈడబ్ల్యూఐడీసీ అధికారులు ఇలా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తమతో సన్నిహిత సంబంధాలు ఉన్న వ్యక్తులకు చెందిన సంస్థలకే నిర్మాణ బాధ్యతలు అప్పగించాలనే ఉద్దేశంతో వ్యవహరిస్తున్నారని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. పేరుకు నిబంధనల, ప్రక్రియ ప్రకారం అంతా చేపట్టామని చెప్పుకునేందుకు టెండర్లు ఆహ్వానించారని విమర్శిస్తున్నారు. నిర్మాణ పనులకు టెండర్లు ఆహ్వానించిన ఏపీఈడబ్ల్యూఐడీసీ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా ప్రభుత్వంగానీ, నిధులు వెచ్చిస్తున్న యూనివర్సిటీకి చెందిన ఇంజనీరింగ్ విభాగం, ఉన్నతాధికారులు చోద్యం చూడటం తగదని పేర్కొంటున్నారు. టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

ప్రణమిల్లిన భక్త జనం

అమ్మవారి సారె సమర్పణకు తరలివస్తున్న భక్త బృందాలు



సారె సమర్పిస్తున్న భక్తులు (ఇన్‌సెట్‌లో) మహా మండపం వద్ద అమ్మవారు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మకు భక్తజనం ప్రణమిల్లారు. ఆషాఢ మాసోత్సవాలు, శుక్రవారం నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు సారెను సమర్పించారు. అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం నుంచి ఈవో వి. సుబ్బారావు దంపతులు మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవమూర్తికి పట్టుచీర, సారెను సమర్పించారు. అనంతరం మల్లేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు.

■ ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల నుంచి భక్తులు బృందాలుగా ఇంద్రకీలాద్రికి చేరుకుని అమ్మవారికి సారెను సమర్పించారు. దీంతో మహా మండపం ఆరో అంతస్తులో పండుగ వాతావరణం నెలకుంది.

కిటకిటలాడిన క్యూలైన్లు

ఉదయం నుంచే భక్తుల రద్దీ కనిపించింది. మహా మండపం, లిఫ్ట్, మెట్ల మార్గంతో పాటు ఘాట్ రోడ్డులో కొండపైకి చేరుకున్న భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీతో సర్వ దర్శనం క్యూలైన్‌తో పాటు రూ. 100, రూ. 300 టికెటు క్యూలైన్లు కిటకిటలాడాయి. సాయంత్రం 4 గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి పంచ హారతుల సేవ నిర్వహించగా, సేవలో పాల్గొనే టికెట్లకు డిమాండ్ కనిపించింది. సాయంత్రం ఆరున్నర గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అమ్మవారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు.

మౌలిక వసతుల పరిశీలన

ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న ఉత్సవాల నేపథ్యంలో భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలను, ఏర్పాట్లను నోడల్ అధికారి టి.చంద్ర కుమార్ పరిశీలించారు. ఆయన వెంట దుర్గ గుడి ఈవో శీనానాయక్, ఆలయ అధికారులు ఉన్నారు.

సి‘ఫార్సు’ల బది‘లీలలు’

- నేటి నుంచి సెక్రటరీల బదిలీలకు కౌన్సెలింగ్
- నచ్చిన సచివాలయంలో పోస్టింగ్ కోసం ఎమ్మెల్యేల నుంచి సిఫార్సుల లేఖలు
- లెటర్లు ఇప్పిస్తామంటూ కార్పొరేటర్లు నగదు వసూలు
- పారదర్శకంగా నిర్వహించాలని కోరుతున్న సెక్రటరీలు



గుంటూరు నగరంలో సచివాలయం

నెహ్రూనగర్: ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న 14 అర్బన్ లోకల్ బాడీస్‌లో పనిచేసే సచివాలయ సెక్రటరీలకు బదిలీల కౌన్సెలింగ్ శనివారం, ఆదివారం గుంటూరు నగరంలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రెండు రోజుల పాటు జరగనుంది. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్, తెనాలి, నరసరావుపేట, బాపట్ల, పొన్నూరు, రేపల్లే, సత్తెనపల్లి, వినుకొండ, పిడుగురాళ్ల, మాచర్ల, దాచేపల్లి, చిలకలూరిపేట, గురజాల మున్సిపాలిటీలకు సంబంధించిన వార్డు అడ్మిన్ సెక్రటరీలు, వార్డ్ ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు, వార్డ్ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీలు, వార్డ్ శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు, వార్డ్ ఎమినిటీ సెక్రటరీలు, వార్డ్ ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలు హాజరుకావాలి. ఈ మేరకు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఉత్తర్వులు జారీ చేశారు. రూరల్ ప్రాంతంలో కూడా ఈ నెలఖారులోపు నిర్వహించేందుకు అధికారులు కార్యచరణ సిద్ధం చేస్తున్నారు.

వీరికి ప్రాధాన్యత

వార్డు సచివాలయ సెక్రటరీల బదిలీల్లో దివ్యాంగులకు, విజువల్లీ చాలెంజ్‌డ్ సిబ్బందికి, మెడికల్ గ్రౌండ్స్ కింద క్యాన్సర్, హార్ట్ సర్జరీ, కిడ్నీ మార్పిడీ, మానసిక వ్యాధుల కలిగిన పిల్లల తల్లిదండ్రులకు, స్పౌజ్ కేటగిరి వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఐదేళ్లు దాటితే తప్పనిసరిగా బదిలీలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఐదేళ్లలోపు సర్వీస్ ఉన్న వారికి రిక్వస్ట్ మీద బదిలీలు చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. మిగులు సిబ్బందిని ప్రభుత్వ ఆదేశాలు వచ్చేంత వరకు వారికి కేటాయించిన సచివాలయంలో పరిధిలోనే విధులు నిర్వహించేందుకు అవకాశం కల్పించనున్నారు. అర్బన్ లోకల్ బాడీస్(యూఎల్‌బీ)అయితే సొంత వార్డులో పోస్టింగ్ రాదు. రూరల్ ప్రాంతాల్లో అయితే సొంత మండలంలో పోస్టింగ్ కేటాయించకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 11082 మంది సెక్రటరీలు

గుంటూరు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అర్బన్, రూరల్ కలుపుకుని 1344 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 11082 మంది సెక్రటరీలు పని చేస్తున్నారు. వీరిలో కొంత మంది సెక్రటరీలు డెప్యూటేషన్‌పై వెళ్లిన వారు ఉన్నారు. వీరు కూడా కౌన్సెలింగ్‌కు హాజరై మిగుల ఉద్యోగుల కింద ఉండనున్నారు. వీలైతే డెప్యూటేషన్‌పై పనిచేసే సెక్రటరీలకు బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.

కార్పొరేటర్ల దందా

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న సెక్రటరీలు వేరే సచివాలయానికి బదిలీ కావడానికి ఆయా ప్రాంత కార్పొరేటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. ఎమ్మెల్యేల నుంచి సిఫార్సులు లేఖలు ఇప్పిస్తున్నట్లు సమాచారం. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, పశ్చిమ నియోజకవర్గ పరిధిలో గళ్లా మాధవి, ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలో బూర్ల రామాంజనేయులు దగ్గర నుంచి తమకు అనుకూలంగా ఉండే సచివాలయ ఉద్యోగులను పోస్టింగ్ ఇప్పించుకునేందుకు లెటర్లు ఇప్పిస్తున్నారు. దీనికిగానూ ఒక్కో సెక్రటరీ నుంచి రూ.20 నుంచి 25 వేలు దాకా కార్పొరేటర్లు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పారదర్శకంగా జరపాలి



గ్రామ/ వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలి. ఉద్యోగుల సీనియారిటీ/ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ చేపట్టాలి. ఐదు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకొని ఉన్న ప్రతి ఉద్యోగి పోస్టును ఖాళీగా చూపించాలి. కౌన్సెలింగ్ సమయంలో ఏ ఒక్క ఖాళీ కూడా బ్లాక్ చేయకుండా చూడాలి. బదిలీలపై ప్రభుత్వం ఇచ్చిన జీఓ నం. 5, 6లో విధివిధానాలను కచ్చితంగా పాటించే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలి. ప్రజా ప్రతినిధులు ఇచ్చే సిపార్సు లేఖల వల్ల ఏ ఒక్క ఉద్యోగి నష్టపోకుండా చూడాలి.

– షేక్ అబ్దుల్ రజాక్, రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం

రాజధాని రైతులపై ‘పూలింగ్’ పిడుగు

- పరిధి విస్తరణ పేరుతో 43వేల ఎకరాల సమీకరణ
- భూముల రేట్లు అధికంగా ఉండటంతో ఇచ్చేందుకు రైతుల విముఖత
- అవసరాల మేరకే తీసుకోవాలంటూ సీఎంని కోరిన అధికార పార్టీ నేతలు
- అంతర్జాతీయ విమానాశ్రయం పేరుతో తమ భూములకు గండికొట్ట వద్దంటున్న రైతులు
- రెండు గ్రామాలు కాలగర్భంలో కలిసిపోతాయని భయపడుతున్న గ్రామస్తులు



సాక్షి ప్రతినిధి, గుంటూరు / తాడికొండ: రాజధాని పరిసర ప్రాంత అన్నదాతల నెత్తిన మళ్లీ భూ సమీకరణ పిడుగు పడనుంది. రెండు రోజుల కిందట కేబినెట్ భేటీలో మరో 43వేల ఎకరాలు రాజధాని నిర్మాణానికి అవసరమంటూ సమీకరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెదవి విరుస్తున్న రైతులు

ప్రస్తుతం సమీకరించిన 33 వేల ఎకరాల భూమి గడచిన 12 ఏళ్లలో ఎటువంటి అభివృద్ధి చెందలేదని, వారికే న్యాయం జరగనప్పుడు తాము భూములు ఇస్తే ఏం చేస్తారంటూ రైతులు పెదవి విరిస్తున్నారు. రాజధానిలో గతంలో భూములు ఇచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియ ఇంత వరకు పూర్తి కాలేదు. మళ్లీ భూసమీకరణ అంటే ఎలా ? అని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. గతంలో ప్రభుత్వం సమీకరణ సమయంలో ఇచ్చిన ఒప్పందాలు కూడా ప్రభుత్వం అమలు చేయలేదు. రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల ప్రక్రియలో భాగంగా అభివృద్ధి చేసిన లే-అవుట్లను అందజేస్తామని ప్రభుత్వం వెల్లడించింది. కాని ఇప్పటి వరకు రిటర్నబుల్ ప్లాట్లు ఎక్కడ ఇచ్చారు.. దానికి రోడ్లు, ఇళ్ల స్థలాలు ఎక్కడ ఉన్నాయో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది.

త్యాగం చేసిన రైతులకు నష్టం

ప్రైవేటు సంస్థలకు భూములు కట్టబెట్టడం మినహా భూములిచ్చి త్యాగం చేసిన రైతులకు గత 12 ఏళ్లల్లో ఒరిగిందేమీ లేదు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన నేపథ్యంలో రానున్న నాలుగేళ్లలో సమీకరణ ప్రక్రియ పూర్తి కాదని, ఒకవేళ భూములిస్తే తరువాత తమ సంగతేంటనేది ఆ ప్రాంత రైతుల నుంచి వస్తున్న ప్రశ్న.

రైతుల్లో పలు సందేహాలు

ఇటీవల తాడికొండ మండలంలో నిర్వహించిన గ్రామసభల్లో స్థానిక రైతులు పలు సందేహాలు లేవనెత్తారు. ఒక వేళ పూలింగ్‌కు తీసుకుంటే కొలు రూ. 40 నుంచి రూ.50వేలు ఇవ్వాలని కొంత మంది కోరారు. మరికొంత మంది అంతర్జాతీయ విమానాశ్రయం పేరుతో భూ సమీకరణ జరుగుతున్నప్పుడు చిన్న గ్రామాలు తొలగిస్తే తమ సంగతేంటని ప్రశ్నించారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి గ్రామాలు తొలగించమని ఎమ్మెల్యే చెబుతున్నప్పటికీ రైతులు నమ్మడం లేదు. తమ గ్రామాలు తొలగించేందుకు కుట్ర జరుగుతుందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భూములు ఇవ్వమని కరాఖండిగా చెబుతున్న రైతులు

ముందు 33వేల ఎకరాల్లో అభివృద్ధి చేసి చూపించిన తరువాత తాము పూలింగ్‌కు సహకరిస్తామని, ఇప్పుడికిప్పుడు తమ భూములు వదులుకోబోమని కరాఖండిగా రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తే తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులే వ్యతిరేకించేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఆయా వర్గాలకు చెందిన వారి భూములు ఈ ప్రాంతంలో అధికంగా ఉన్న నేపథ్యంలో పూలింగ్ ప్రక్రియకు విఘాతం కలుగుతుందని వారే ప్రస్తావిస్తుండటం గమనార్హం.

రైతుల్లో వ్యతిరేకత

తాడికొండ మండలానికి చెందిన ఓ సీనియర్ టీడీపీ నాయకుడు ఇటీవల పొన్నెకల్లు గ్రామంలో జరిగిన పీ -4 సదస్సుకు వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడుకు వినతిపత్రం అందజేశారు. అందులో రైల్వే లైనులు, అంతర్గత రహదారుల వరకు భూ సమీకరణ చేస్తే తమకు అభ్యంతరం లేదని, అన్ని పొలాలు పూలింగ్‌కు ఇవ్వాలంటే సుముఖంగా లేమంటూ పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం మాత్రం అనుకున్నదే తడవుగా భూ సమీకరణ పేరుతో నిర్ణయం తీసుకుని మంత్రి వర్గ భేటీలో ప్రకటించడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేసేందుకు తీకున్నే నిర్ణయంపై రైతులు బహిరంగంగానే తమ వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు ప్రస్తుతం పూలింగ్‌కు తీసుకున్న భూములకు ధరలు తగ్గి, తీవ్రంగా నష్టపోతామంటూ గతంలో పూలింగ్‌కు ఇచ్చిన రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిన చందాన తమ పరిస్థితి మారిందని వాపోతున్నారు. తరతరాలుగా ఉన్న పంట భూములను ప్రభుత్వం తీసుకునేందుకు చేస్తున్న కుట్రలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రాజధాని నిర్మాణానికి 33వేల ఎకరాలు చాలని గతంలో ప్రకటించిన ప్రభుత్వం, ఇప్పుడు అంతర్జాతీయ విమానాశ్రయం పేరుతో తమ పొట్ట గొడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో ఆరుగురికి జైలు శిక్ష

అద్దంకి: ఇద్దరు వ్యక్తులపై ఆరుగురు హత్యాయత్నం చేసిన కేసులో నిందితులపై నేరం రుజువు కావడంతో జడ్జి ఒక్కొక్కరికి 7 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.17 వేల చొప్పున జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించినట్లు సంతమాగులూరు ఎస్సై పట్టాభి తెలిపారు. కేసు వివరాలు.. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలంలోని కుందుర్రు గ్రామానికి చెందిన బొమ్మినేని కృష్ణయ్యతో నిందితులు జడ వెంకటేశ్వర్లు, జడ వీరాంజనేయులు, జడ వెంకట్రావు, జడ శ్రీనివాసరావు, జడ గోపి, కొనికి యోగయ్యలకు పాత గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో 2020 నవంబర్ 11న కృష్ణయ్య, ఆయన బాబాయి వీరాస్వామి కొమ్మాలపాడు వెళ్లి పని అయిన తర్వాత తిరిగి కుందుర్తికి బయలుదేరారు. కొమ్మాలపాడు ఎన్ఎస్‌పీ కెనాల్ వద్ద నిందితులు కాపు కాచి మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. కృష్ణయ్య కాలు, వీరాస్వామికి చెయ్యి విరిగాయి. తీవ్ర గాయాలైన వారిని 108 అంబులెన్స్‌లో హాస్పిటల్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పట్లో ఈ ఘటనపై సంతమాగులూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి.శివన్నారాయణ హత్యాయత్నం కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్ట్ చేసి సంబంధిత కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నిందితులకు 7 సంవత్సరాల జైలు శిక్ష, రూ.17 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం అద్దంకి కోర్టు న్యాయమూర్తి డి. నాగ వెంకటలక్ష్మి తీర్పు వెలువరించారు.



జైలు శిక్ష పడిన నిందితులను తరలిస్తున్న పోలీసులు

ఆటో ఢీకొని ఒకరికి గాయాలు

- తొడలో దిగిన ఇనుప బద్దె
- తొలగించిన వైద్యులు



ద్విచక్ర వాహనదారుడి తొడలో నుంచి దూసుకు పోయిన ఇనుప బద్దె



తుంటి పైభాగం నుంచి వెనుకకు చొచ్చుకొని వచ్చిన ఇనుప బద్దె

కొల్లూరు: ఆటో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వాహనదారుడు తీవ్ర గాయాలబారిన పడిన ఘటన మండలంలోని పెదలంక వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, క్షతగాత్రుడి బంధువుల కథనం మేరకు.. చుండూరుకు చెందిన పడాల సప్తగిరి మండలంలోని సుగ్గునలంకకు చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న సప్తగిరి అత్తగారి ఇంట్లో ఉన్న భార్య వద్దకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. మండలంలోని పెదలంక వద్ద ఎదురుగా కనిగిరిలంక వైపు నుంచి వస్తున్న ఆటో సప్తగిరి ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ప్రమాద సమయంలో ఆటోకు సంబంధించిన ఇనుప బద్దె ద్విచక్ర వాహనదారుడి తొడలో నుంచి వెనుక తుంటిపై భాగం నుంచి బయటకు చొచ్చుకువచ్చింది. స్థానికులు వ్యక్తి తొడలోంచి చొచ్చుకు వెళ్లిన ఇనుప బద్దెను తమ వద్ద అందుబాటులో ఉన్న పరికరాలతో కట్ చేసి 108లో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు క్షతగాత్రుడి తొడ ప్రాంతం నుంచి చొచ్చుకొని వెళ్లిన ఇనుప బద్దెను తొలగించారు. శరీరం అంతర్భాగంలో ఉన్న కొని అవయవాలు దెబ్బతిన్నట్లు వైద్యులు సూచించడంతో క్షతగాత్రుని బంధువులు మెరుగైన వైద్యసేవల కోసం గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగానే ఉన్నట్లు బంధువులు చెప్పారు.



అమ్మో.. కిలేడీ కిల్లర్స్!

- ఆడతనానికి మాయని మచ్చ !
- ఆభరణాల కోసం హత్యలు చేస్తున్న మహిళలు
- నాడు సైనేడ్‌తో నలుగురి హత్య
- నేడు దాడిచేసి ముగ్గురి హత్య
- అన్నీ పట్టపగలు.. బెరుకులేని దారుణాలు
- పోలీసుల అప్రమత్తతతో జైలుపాలు

సుకుమారానికి ప్రతీక అయిన మహిళలే ఇప్పుడు క్రూర నేరాలకు పాల్పడుతున్న తీరు సమాజాన్ని కలవరపెడుతోంది. సైనేడ్‌ను వినియోగించి నలుగురిని హతమార్చిన కేసులో గతేడాది ముగ్గురు మహిళలు అరెస్టయిన వైనం జిల్లా ప్రజల్ని ఆశ్చర్య పరిచింది. నిందితుల్లో ఇద్దరు తల్లీకూతుళ్లు ఉండటం ఆడతనానికి మాయని మచ్చ. మళ్లీ ఇప్పుడు ముగ్గురు వృద్ధ మహిళలను దారుణంగా హత్య చేసిన కేసులో కీలక సూత్రధారి, ఏ-1 ముద్దాయి కూడా మహిళే కావడం ఆందోళన కలిగిస్తోంది. బంగారు ఆభరణాలు, డబ్బుల కోసం సాటి మహిళలను, బంధుత్వాలు సైతం మరచి ప్రాణాలను తీయగల స్థితికి మహిళలు చేరడం విస్మయానికి గురిచేస్తోంది. ప్రేమను, క్షమను పంచే మహిళలు స్వార్థానికి, కూరత్వానికి పరాకాష్టగా చట్టం ముందు దోషుల్లా నిలవడం మన విలువలకు, సమాజానికి గట్టి ఎదురుదెబ్బ.



తెనాలి: గతేడాది జూన్‌లో స్థానిక యడ్ల లింగయ్య కాలనీకి చెందిన రజిని, తనకు పరిచయస్తురాలైన నాగూర్‌బీని ఆటోలో ఎక్కించుకుని తెనాలి-నారాకోడూరు రోడ్డులోని వడ్లమూడి వద్ద నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లింది. మార్గమధ్యంలో ఆటో డ్రైవర్‌తో రజిని బ్రీజర్ కొనిపించింది. అదే కాలనీవాసి వెంకటేశ్వరి అలియాస్ బుజ్జి బైకుపై వీరిని వెన్నంటి వచ్చింది. ముగ్గురూ నిర్మానుష ప్రదేశానికి వెళ్లారు. అక్కడ బ్రీజర్‌లో సైనేడ్ కలిపి నాగూర్‌బీకి ఇచ్చారు. ఆ వెంటనే ఆమె చనిపోయింది. ఒంటిపై బంగారు ఆభరణాలను దోచుకుని రజిని, వెంకటేశ్వరి తాపీగా ఇంటికి వచ్చారు. నాగూర్‌బీ మృతదేహం వెలుగులోకి రావడంతో అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఆటో డ్రైవర్‌ను గుర్తించి ప్రశ్నించడంతో రజని గురించి చెప్పాడు. ఆమెను తీసుకొచ్చి విచారించాక మరిన్ని సంచలన విషయాలు బహిర్గతమయ్యాయి. నాగూర్‌బీ హత్యనే కాదు..రజని, వెంకటేశ్వరితోపాటు ఆమె తల్లి రమణమ్మ కలిసి 2022 నుంచి మరో ముగ్గురిని సైనేడ్‌తో హత్య చేశారని, వీరి అరెస్టు చూపుతూ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ చెప్పారు.

అప్పు ఎగ్గొట్టేందుకు హత్య

మార్కాపురానికి చెందిన సుబ్బలక్ష్మిని ఆమె ఆస్తి, డబ్బులు, బంగారు ఆభరణాలు కోసం ఇదే తరహాలో మద్యంలో సైనేడ్ కలిపి ఇచ్చి చంపారు. వెంకటేశ్వరికి సుబ్బలక్ష్మి స్వయాన అత్త అవుతుంది. ఆ తర్వాత 2023లో నాగమ్మ అనే మహిళను థమ్సప్‌లో సైనేడ్ కలిపి హతమార్చారు. ఆమె వద్ద తీసుకున్న రూ.20 వేల అప్పు ఎగ్గొట్టేందుకు చంపేశారు.



సైనేడ్ కిల్లర్స్ చేతిలో హత్యకు గురైన మోషే మృతదేహాన్ని వెలికితీయిస్తున్న అధికారులు, పోలీసులు(ఫైల్)

భార్యతో చేతులు కలిపి హత్యకు పథకం

తెనాలికి చెందిన పీసు అలియాస్ మోషే తరుచూ భార్యను వేధిస్తున్నాడు. అతన్ని చంపేందుకు భార్యతో చేతులు కలిపి 2024లో మద్యంలో సైనేడ్ కలిపారు. అతను చనిపోయిన తర్వాత వచ్చే పెన్షన్, ఇన్సూరెన్స్ డబ్బులు పంచుకునేందుకు ఆమెతో అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు. ఈ నాలుగు హత్యలే కాకుండా మరో ముగ్గురిపై హత్యాయత్నం చేశారు. చివరిసారి పథకం పారలేదు. అప్పులు ఎగ్గొట్టడం, వారి వద్ద నున్న బంగారు ఆభరణాలు దోచుకోవాలన్న ఉద్దేశంతోనే సైనేడ్ కలిపి హత్యలు చేసినట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ వెల్లడించారు. వీరికి సైనేడ్ విక్రయించిన నేరంపై మరొకరిని అరెస్టు చేశారు.

ఆభరణాల కోసం వియ్యపురాళ్ల హత్య

పట్టణ శివారులో ఈనెల 19న జరిగిన జంట హత్యల కేసులో ప్రైవేటు బీమా కంపెనీ ఏజెంటు కుసుమకుమారిని ఏ-1 ముద్దాయిగా పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే.



ఇటీవల దారుణ హత్యకు గురైన రాజేశ్వరి



కుసుమకుమారి చేతిలో హత్యకు గురైన అంజమ్మ

ఒంటరిగా ఉంటున్న వియ్యపురాళ్లు దాసరి రాజేశ్వరి (65), పిట్టా అంజమ్మ (70)ను పట్టపగలు 11.30 గంటల ప్రాంతంలో వారు నివాసముంటున్న ఇంటి కిందిభాగంలోనే హత్యకు గురయ్యారు. వారి ఒంటిపై బంగారు ఆభరణాలు అదృశ్యమయ్యాయి. సీసీ కెమెరా నిందితులను పట్టిచ్చింది. ఈ కేసులో కుసుమకుమారితోపాటు ఇద్దరు యువకులను పోలీసులను అరెస్టు చేశారు. ఇద్దరిలో ఒకరు ఆటో డ్రైవర్ కాగా, మరొకడు మైనర్ కావడం గమనార్హం. మారీసుపేట రెండుగేట్ల మధ్య ఒక ఇంటిలో వీరు ప్రణాళిక రచించుకోవడం, రెక్కీలు నిర్వహించడం, ఆ ప్రకారం నేరాలకు పాల్పడుతూ వచ్చినట్టు పోలీసు విచారణలో వెల్లడైంది.

వృద్ధురాలి హత్యలో కూడా పాత్ర

జంట హత్యలకు ముందు గత నెలలో కుసుమకుమారి నివాసానికి దగ్గర్లోనే ఓ వృద్ధురాలు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందింది. ఆ నేరం కూడా వీరు చేసిందేనని తమ విచారణలో నిందితులు అంగీకరించినట్టు పోలీసులు అరెస్టు చేసినపుడు తెలియజేశారు. కేవలం బంగారు నగలు, డబ్బు కోసం తోటి మహిళలను అంతమొందించిన నేరంలో కుసుమకుమారి నేరస్థురాలిగా రిమాండ్‌కు వెళ్లింది. ఈ నేరాలతో గతేడాది వెలుగుచూసిన సైనేడ్ హత్యలను కూడా ఇప్పుడు చర్చించుకుంటున్నారు. 'అమ్మో...లేడీ కిల్లర్స్.' అనుకుంటున్నారు స్థానికులు

సీ మౌత్‌ను ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలి

- సహకరించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి డిమాండ్
- ఆక్రమణకు గురైన సీమౌత్‌ను పరిశీలించిన రమాదేవి



తీరప్రాంతాల్లోని మత్స్యకారులతో మాట్లాడుతున్న రమాదేవి

బాపట్లటౌన్: ఈపురుపాలెం స్ట్రైట్‌కట్ సీ మౌత్ కాలువను ఆక్రమించిన భూ కబ్జాదారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి డిమాండ్ చేశారు. తీరప్రాంతం ఆక్రమణకు గురైన సీమౌత్‌ను శుక్రవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ శ్రీ భ్రమరా డెవలపర్స్ సారథ్యంలోని ఆలోహ రిసార్ట్స్ కోసం ఇక్కడ సహజ సిద్ధంగా ఎల్ ఆకారంలో ఉన్న సీ మౌత్ ప్రాంతాన్ని సుమారు 15.35 ఎకరాలు పీడబ్ల్యూడీ కాలువ భూమిని మాయం చేశారని ఆరోపించారు. కాలువకు, సముద్రానికి మధ్య హై టైడ్ లైన్ పరిధిలో ఉన్న సహజ సిద్ధమైన ఇసుక దిబ్బలు కూడా పూర్తిగా తొలగించి పెద్దమొత్తంలో ఇసుకను తరలించి సమీపంలోని రొయ్యల చెరువులను పూడ్చారని చెప్పారు. దీంతో మత్స్యకారుల వృత్తికి తీవ్ర ఆటంకం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు అధికారంలోకి వచ్చిన వెంటనే మత్స్యకారుల సమస్యలను పరిష్కరిస్తామంటూ హామీ ఇచ్చిన స్థానిక ఎమ్మెల్యే, కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత కబ్జాదారులతో కుమ్మక్కయ్యారని ఎద్దేవా చేశారు. ఇంత విధ్వంసం జరుగుతున్నా జిల్లా అధికార యంత్రాంగం కూడా పూర్తిగా భూ కబ్జాదారులకు కొమ్ము కాయడం సిగ్గుచేటన్నారు. మండుటెండలో మత్స్యకారులు ఆందోళన చేస్తుంటే ఘటనా స్థలానికి చేరుకున్న స్థానిక ఎమ్మెల్యే కనీసం మత్స్యకారులతో మాట్లాడకుండా ఆక్రమణదారులతో మాట్లాడి తిరిగి వెళ్లడంపై మండిపడ్డారు. ఏకంగా సముద్రాన్నే కబ్జా చేస్తుంటే రాష్ట్రంలోని మంత్రులు, ముఖ్యమంత్రి ఏం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరుకు చెందిన ఎమ్మెల్యేకు చెందిన భ్రమరా కంపెనీ ఈ విధమైన ఆక్రమణకు పాల్పడుతుంటే ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం దేనికి సంకేతమన్నారు. మత్స్యకారులు ఆందోళనతో ఎంతో కొంత కదిలిన జిల్లా అధికార యంత్రాంగం కమిటీల పేరుతో కాలయాపన చేయడం సరైనది కాదని హితవు పలికారు. తక్షణమే ఆక్రమణకు గురైనా ఎల్ ఆకారంలో ఉన్న సీ మౌత్‌ను పూర్తిగా పునరుద్ధరించాలని కోరారు. కాలువను ఆక్రమించిన వారిపై, ఇసుక దిబ్బలు చదును చేసిన వారిపై, వారికి దొంగ పట్టాలు ఇచ్చి సహకరించిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మత్స్యకారులకు అండగా సీపీఎం ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆంధ్రా మాలాద్రి, జిల్లా కార్యదర్శి జి.గంగయ్య, నాయకులు ఎస్.బాబూరావు, పి.కొండయ్య, జి.ఏ సుబాబు, వాడరేవు మాజీ సర్పంచి ఏరిపిల్లి రమణ, చొక్కా రాంబాబు, పీక్కి డేవిడ్, దోనీ కనకరాజు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ ఓవరాల్ చాంపియన్ లక్ష్మి



చీరాల రూరల్: జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సమరోతు లక్ష్మి, ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించింది. బాపట్ల జిల్లా చీరాలకు చెందిన లక్ష్మి, గుంటూరు జిల్లా తాడికొండలో డిగ్రీ చదువుతోంది. రాష్ట్ర జట్టు తరపున కర్ణాటక రాష్ట్రంలో ఈనెల 22 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంది. అన్ని విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి 69 కేజీల జూనియర్ బాలికల విభాగంలో ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించింది. స్క్వాట్‌లో 177 కేజీలు ఎత్తి ద్వితీయస్థానంలో నిలిచింది. బెంచ్‌ప్రెస్‌లో 77.5 కేజీలు, డెడ్‌లిఫ్ట్‌లో 155 కేజీలు కలిపి మొత్తం 410 బరువులు అలవోకగా ఎత్తి ఓవరాల్‌గా మూడో స్థానంలో చాంపియన్‌గా నిలిచి పతకాలతో పాటు సర్టిఫికెట్లను అందుకుంది. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరీ అన్నదాత ప్రసాద్, సంఘ అధ్యక్షులతో పాటు సహచరులు ఆమెను అభినందించారు.

రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో అక్రమ కేసులు

వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్



రేపల్లె: రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో కుటమి ప్రభుత్వం కక్ష సాధింపు రాజకీయాలు చేస్తోందని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ విమర్శించారు. గుళ్లపల్లిలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రజలను పక్కదోవ పట్టిస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో ఏ ఒక్క పథకం కూడా అమలు చేయలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతున్న పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా తప్పుడు కేసులు బనాయించి అణగద్రొక్కే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పోలీసులను పార్టీ కార్యకర్తల్లా వాడుకుంటూ రాజ్యాంగాన్ని అపహాస్యం పాలు చేస్తుందన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అదరరు బెదరరు అన్నారు. పార్టీ అధినేత పిలుపు మేరకు ప్రజా సమస్యలపై ప్రజలతో నిత్యం పోరాటాలు చేస్తూనే ఉంటామన్నారు.

జగన్‌పై కేసులు రాజకీయ కుట్రపూరితమే

రాజకీయ కక్ష సాధింపు, కుట్రలలో భాగంగానే వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని విమర్శించారు. పల్నాడు పర్యటనలో భాగంగా గుంటూరు సమీపంలో ప్రమాదవశాత్తూ సింగయ్య మృతి చెందితే కూటమి ప్రభుత్వం తమ రాజకీయ కక్షకు వాడుకుంటోందన్నారు. ప్రమాదం జరిగిన రోజు సాక్షాత్తూ ఆ జిల్లా ఎస్పీనే ప్రమాదానికి మాజీ సీఎం జగన్ కాన్వాయ్‌కు సంబంధం లేదని, ప్రైవేటు వాహనం ఢీకొనటంతో సింగయ్య మృతి చెందినట్లు తాము గుర్తించామని బహిరంగంగా ప్రకటించారన్నారు. ప్రభుత్వ పెద్దలు ఒత్తిడి తేవటంతో ఎస్పీ మాట మార్చి జగన్‌మోహన్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించారన్నారు. కుట్రలో భాగంగా జగన్‌మోహన్‌రెడ్డికి చెందిన బులెట్‌ప్రూఫ్ వాహనాన్ని సీజ్ చేయటం తగదన్నారు. ఇప్పటికైనా కూటమి పాలకులు రాజకీయ కక్ష సాధింపులు వీడి ప్రజాసంక్షేమంపై దృష్టి సారించాలని హితవు పలికారు. లేనిపక్షంలో భవిష్యత్‌లో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



క్షతగాత్రుడి కాలుకు కట్టు కడుతున్న 108 సిబ్బంది

వేటపాలెం: బైపాస్ రోడ్డు దాటుతున్న వ్యక్తిని వేగంగా వచ్చి ఆటో ఢీ కొట్టిన సంఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. 216 జాతీయ రహదారి బైపాస్ రోడ్డులో సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాల దగ్గరలో సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. చీరాల వైపు నుంచి మామిడి కాయల లోడుతో ఆటో ఒంగోలు వైపు వేగంగా వెళుతోంది. సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద రోడ్డు దాటుతున్న కొమరగిరి బాబూరావుని ఆటో ఢీ కొట్టింది. బాబూరావు ఎగిరి పక్కన పడ్డాడు. అతనికి కాలుకి తీవ్రగాయాలయ్యాయి. 108కి సమాచారం ఇవ్వగా క్షతగాత్రుని చీరాల ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. ఆటో ఆపకుండా వేగంగా వెళ్లిపోయాడు.

సమస్యలు పరిష్కరించకపోతే విధుల బహిష్కరణ

- ప్రభుత్వాన్ని హెచ్చరించిన కార్మిక జేఏసీ నాయకులు
- సీడీఎంఏ కార్యాలయం ముట్టడి



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికుల జేఏసీ నాయకులు

తాడేపల్లి రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో విధులు బహిష్కరిస్తామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. మంగళగిరి నియోజకవర్గం వడ్డేశ్వరంలో గల సీడీఎంఏ కార్యాలయాన్ని శుక్రవారం ముట్టడించారు. ఈ సందర్భంగా పలువురు కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జేఏసీ ఆధ్వర్యంలో గత 52 రోజుల నుంచి నిరసనలు తెలుపుతున్నా కూటమి ప్రభుత్వంలో స్పందన లేదని తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కార్మిక సంఘాలను ప్రభుత్వం చర్చలకు పిలిచిందని, జీతం పెంచే విషయమై ఎటువంటి స్పష్టత ఇవ్వని కారణంగా ఈనెల 28న రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని వెల్లడించారు. 30వ తేదీ నుంచి విధులను బహిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని పలు జోన్ల చైర్మన్లు బాబా ఫకృద్దీన్, మధుబాబు, సత్యం, శ్రీనివాసులు, రాజేష్‌బాబు, ఏసుబాబు, జిల్లా కన్వీనర్లు సతీష్‌కుమార్, మురళీకృష్ణ, ముకుందం, సురేష్, ప్రసాద్, రామ్మూర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,500 గరిష్ఠం : రూ. 2,100

మోడల్ ధర రూ. 1,800

మిర్చి యార్డు సమాచారం

(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	33,890
అమ్మకాలు	40,045
నిల్వ	4,508

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 – 13,000
నంబరు-5	రూ. 10,000 – 13,300
341	రూ. 10,000 – 13,200

నాన్ ఏసీ ప్రత్యేక రకం క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 – 13,500
బాడిగ – 355	రూ. 10,000 – 13,000
ఆర్మూర్	రూ. 9,800 – 11,000
తాలుకాయలు	రూ. 5,000 – 6,800

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,700 – 13,000
నంబరు-5	రూ. 10,000 – 13,300
273	రూ. 10,000 – 12,500
341	రూ. 10,000 – 13,400
4884	రూ. 10,000 – 12,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 – 13,600
బాడిగ – 355	రూ. 10,000 – 13,000
తాలుకాయలు	రూ. 5,500 – 7,000

-కొరిటిపాడు (గుంటూరు)



పసుపు ధరలు

(శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 510

కొమ్ములు : 355 బస్తాలు (ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,200	10,325	10,100

కాయలు : 155 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,100	10,100	10,000

మొత్తం అమ్మకాలు : 382.500 క్వింటాళ్లు

-దుగ్గిరాల

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తప్పనిసరి

జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి కె. పరంధామరెడ్డి



బాపట్లటౌన్: పాఠశాలలు, కళాశాలల స్కూల్ బస్సులకు తప్పని సరిగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని జిల్లా ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ కె. పరంధామరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. స్కూల్ పిల్లల విషయంలో అశ్రద్ధ తగదని, ఫిట్నెస్ సర్టిఫికెట్ రెన్యువల్ చేయించుకోవాలన్నారు. వాహనాలు రిపేరుకు గురైతే తక్షణమే రిపేర్లు కంప్లీట్ చేయించుకొని ఫిట్నెస్ సర్టిఫికెట్ పొందాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారిని డ్రైవర్లుగా నియమించవద్దని సూచించారు. డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అర్హులైన డ్రైవర్లను మాత్రమే బస్సులను నడిపేందుకు అనుమతించాలన్నారు. మద్యం తాగి, సెల్ ఫోన్ నడుపుతూ వాహనాలను నడపవద్దని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతూ తమ తనిఖీలలో పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కేంద్ర ఆరోగ్య పథకం ఎల్‌ఏసీ మెంబర్‌గా గుమ్మడి

లక్ష్మీపురం: సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ లోకల్ అడ్వైజరీ కమిటీ(ఎల్ఏసీ) సభ్యునిగా గుంటూరుకు చెందిన విశ్రాంత సెంట్రల్ జీఎస్టీ సూపరింటెండెంట్ గుమ్మడి సీతారామయ్యని నియమిస్తూ సీజీహెచ్ఎస్ అడిషనల్ డైరెక్టర్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవిలో ఆయన రెండేళ్ల పాటు కొనసాగనున్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు తరపున నియమితులైన సీతారామయ్యని శుక్రవారం సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సుజిత్ మల్లిక్ కన్నవారితోటలోని కార్యాలయంలో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా కమిషనర్ మల్లిక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య పరిరక్షణకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా సీతారామయ్య కృషి చేయాలని సూచించారు. సీజీహెచ్ఎస్ పరిధిలోకి మరిన్ని ఎంప్యానల్డ్ ఆసుపత్రులను తీసుకురావాలని కోరారు. డిపార్ట్‌మెంట్‌కు చేసిన సేవలు అందించిన సీతారామయ్యకు ఈ హోదా దక్కడం శాఖకు గర్వకారణమని పేర్కొన్నారు.విశ్రాంత జీవితంలో సేవ చేసే బాధ్యత ఇచ్చిన సీజీహెచ్ఎస్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ రోహిణికి సీతారామయ్య కృతజ్ఞతలు తెలిపారు.